నేడు డయల్ యువర్ డీఎం

చైతన్యపురి: దిల్‌సుఖ్‌నగర్‌లోని హైదరాబాద్–2 ఆర్టీసీ డిపో నుంచి నడిచే బస్సులకు సంబంధించి ప్రయాణికుల నుంచి సలహాలు, సమస్యలు, ఫిర్యాదులు స్వీకరించేందుకు శనివారం సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు డయల్ యువర్ డీఎం నిర్వహిస్తున్నట్లు మేనేజర్ కృష్ణమూర్తి తెలిపారు. ఉద్గిర్, బీచ్‌కుండ్, జూకల్, కొల్హాపూర్, విజయవాడ, బైలడిల్లా, జగదల్‌పూర్, బెంగుళూరు, తొర్రూర్ వెళ్లే బస్సులు ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రయాణికులు నేరుగా డీఎంతో మాట్లాడవచ్చన్నారు. ఎలాంటి సమస్యలున్నా 9959226249 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

నేడు విస్తృతస్థాయి సమావేశం

మన్సూరాబాద్: కాంగ్రెస్ పార్టీ ఎల్‌బీనగర్ నియోజకవర్గం ముఖ్య కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం శనివారం మధ్యాహ్నం 2 గంటలకు సాగర్ రింగ్‌రోడ్ చౌరస్తా సమీపంలోని వన్ కన్వెన్షన్‌లో నిర్వహిస్తున్నట్లు టీపీసీసీ ప్రచారం కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ తెలిపారు. ఈ సమావేశానికి కాంగ్రెస్ పార్టీ రంగారెడి జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, జిల్లా పరిశీలకులు శివసేనారెడ్డి హాజరవుతున్నట్లు పేర్కొన్నారు.

ముగిసిన వార్షికోత్సవ పూజలు



పూజల్లో పాల్గొన్న ఆలయ కమిటీ ప్రతినిధులు

వనస్థలిపురం: వనస్థలిపురం ఏరియా ఆసుపత్రి సమీపంలోని ఎల్లమ్మదేవి ఆలయంలో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఎల్లమ్మదేవి నవఏకాదశ (20వ) వార్షికోత్సవ పూజలు శుక్రవారం ముగిసాయి. ఈ సందర్భంగా దేవతారాధన, జమదగ్ని సమేత రేణుకా ఎల్లమ్మదేవి కళ్యాణోత్సవం, అన్న సమారాధన, ఆశీర్వచనం, ద్వాదశ హారతి, ఉయ్యాల సేవ, తీర్థ గోష్ఠి, ఉత్సవ సమాప్తి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డి, అధ్యక్షుడు మాలె రాంరెడ్డి, ప్రధాన అర్చకులు కే.లింగమూర్తిశర్మ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కోడింగ్, కంప్యూటర్ కోర్సుపై ఉచిత శిక్షణ

చాదర్‌ఘాట్: మురికివాడలో నివసించే పేద విద్యార్థులకు 10వ తరగతి పాసై చదువుకోలేని స్థితిలో ఉన్న వారికి ఉచితంగా మెడికల్ కోడింగ్, కంప్యూటర్స్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు అప్సా సంస్థ ప్రాజెక్ట్ అధికారి బసవరాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18–27 సంవత్సరాల వయసు గల వారికి మూడు నెలలు శిక్షణ ఉంటుందని డిగ్రీ చేసి ఉండాలన్నారు. కంప్యూటర్ కోర్స్ కోసం ముషీరాబాద్ చౌరస్తాలోని కార్యాలయానికి అదే విధంగా మెడికల్ కోడింగ్ శిక్షణ కోసం హబ్సిగూడ చౌరస్తా కార్యాలయానికి రావాలని మరిన్ని వివరాలకు 9912944967 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

శాంతి ప్రార్థన సభ విజయవంతం చేయాలి



ప్రభుచరణ్

మలక్‌పేట: డాక్టర్ కేఏ పాల్ సారథ్యంలో నిర్వహించనున్న ప్రపంచ శాంతి ప్రార్థన సభను విజయవంతం చేయాలని మూసారంబాగ్ క్రిస్టియన్ లైఫ్ సెంటర్ చర్చి సీనియర్ పాస్టర్, రెవరెండ్ డాక్టర్ ఎం.ఎస్ ప్రభుచరణ్ కోరారు. సికింద్రాబాద్ జింఖానా గ్రౌండ్‌లో ఈ నెల 24న శనివారం సాయంత్రం 6 గంటలకు ప్రపంచ శాంతి ప్రార్థన సభ ప్రారంభమవుతుందన్నారు. సంఘాలు, సమాజం, దేశం, శాంతి సౌభాగ్యాల సఖ్యత కోసం చేపట్టిన శాంతి ప్రార్థన సభకు క్రైస్తవులు అధిక సంఖ్యలో తరలిరావాలన్నారు.

ట్రై సైకిళ్ల పంపిణీకి సిద్ధం

చాదర్‌ఘాట్: వికలాంగుల ట్రై సైకిళ్లు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని రాష్ట్ర వికలాంగుల సహకార సంస్థ జనరల్ మేనేజర్ ప్రభంజనరావు తెలిపారు. శుక్రవారం ఆయన మలక్‌పేటలోని వికలాంగుల సహకార సంస్థ కార్యాలయంలో మాట్లాడుతూ.. ట్రైసైకిళ్లు కావాల్సిన వారు సదరం సర్టిఫికెట్లతో పాటు ఆధార్‌కార్డు జిరాక్స్ తీసుకుని జిల్లాలోని డీడబ్ల్యూఓ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. నల్లగొండ జిల్లాకు 25, నిజామాబాద్‌కు 20, ఖమ్మంకు 25, సూర్యపేటకు 20 చొప్పున పంపిణీ చేశామన్నారు.

ఓటరు నమోదును సద్వినియోగం చేసుకోవాలి



జయంత్, డీసీ

చాదర్‌ఘాట్: ప్రతి సంవత్సరం ఓటు నమోదుకు నాలుగుసార్లు అవకాశం ఉందని అర్హులంతా సద్వినియోగం చేసుకోవాలని మలక్‌పేట ఎన్నికల రిటర్నింగ్ అధికారి డిప్యూటీ కమిషనర్ జయంత్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జనవరి, ఏప్రిల్, జూలై, అక్టోబర్ నెలల్లో ఓటు నమోదు కార్యక్రమం ఉంటుందన్నారు. ఫారం–8 ద్వారా సమీపంలోని బీఎల్‌ఓ వద్ద కానీ,ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. జనవరి1 నుంచి ఇప్పటి వరకు 752 మంది ఓటర్లుగా నమోదు చేసుకున్నారన్నారు.

రోడ్డుకు చిల్లులు.. జేబుల్లోకి బిల్లులు?



కాంట్రాక్టర్ రహదారి వేశాడని చెబుతున్న సింగరేణి కాలనీ రోడ్డు ఇదే

- రోడ్డు వేయకుండానే కాంట్రాక్టర్‌కు బిల్లుల చెల్లింపు
- అధికారులు కాంట్రాక్టర్ కుమ్మక్కుతో ప్రజాధనం వృథా
- చర్యలు తీసుకోవాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్‌కు కార్పొరేటర్ ఫిర్యాదు



సైదాబాద్: ఐఎస్‌సదన్ డివిజన్ పరిధిలో జీహెచ్‌ఎంసీ అధికారుల అవినీతి పరాకాష్ఠకు చేరింది. అభివృద్ధి పనులు పూర్తి కాకుండానే అందుకు సంబంధించిన బిల్లులను కాంట్రాక్టర్‌కు చెల్లించేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. జీహెచ్‌ఎంసీ అధికారులు, కాంట్రాక్టర్ కుమ్మకై లక్షలాది ప్రజాధనం జేబుల్లోకి వెళ్తుంది. సింగరేణి కాలనీ వాంబే గృహ సముదాయాల వద్ద సీసీ రహదారులు నిర్మించే పనుల్లో భాగంగా సుమారు రూ. 10 లక్షలను ఎలాంటి పనులు చేయకుండానే కాంట్రాక్టర్‌కు అధికారులు చెల్లింపులు చేసారని ఏకంగా డివిజన్ కార్పొరేటరే ఆరోపిస్తుండటం సంచలనంగా మారింది. ఈ మేరకు కార్పొరేటర్ పూర్తి ఆధారాలతో శుక్రవారం జీహెచ్‌ఎంసీ కమిషనర్ కర్ణన్‌ను కలిసి ఫిర్యాదు చేసారు. అవినీతికి పాల్పడిన అందరిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

పనుల వివరాలివి..

- గతేడాది గణేష్ నిమజ్జన ఉత్సవాలు పురస్కరించుకొని ఐఎస్‌సదన్ డివిజన్ పరిధిలోని సింగరేణి కాలనీ వాంబే గృహ సముదాయాల వద్ద సీసీ రహదారి నిర్మించడానికి అధికారులు ప్రతిపాదనలు చేసారు.
- అందుకు సంబంధించి కేటాయించబడిన వర్క్ ఐడీ:24041451, టెండర్ ఐడీ:539228కి 24-08-2024న అనుమతి మంజూరైంది.
- సదరు కాంట్రాక్ట్‌ను ప్రాజెక్ట్ నేమ్ మెన్షన్‌గా రూ. 9.90 లక్షలకు ఖాన్ కన్‌స్ట్రక్షన్ సంస్థ పనులను దక్కించుకుంది.
- అయితే గత సంవత్సరం గణేష్ నిమజ్జన ఉత్సవాలు పూర్తయ్యాయి. కానీ సింగరేణి కాలనీ వాంబే గృహ సముదాయాల వద్ద రహదారుల పరిస్థితి ఏ మాత్రం మారలేదు.
- కాంట్రాక్ట్ విషయమై అధికారులు, కాంట్రాక్టర్‌తో కుమ్మక్కై, అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లును కొంత మేరనో, మొత్తంగానో చెల్లింపులు చేశారని కార్పొరేటర్ ఆరోపిస్తున్నారు.
- ఏది ఏమైనా జీహెచ్‌ఎంసీ అధికారుల అవినీతి విషయమై డివిజన్ కార్పొరేటరే ఆరోపిస్తున్న నేపథ్యంలో జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులు సత్వరమే స్పందించి ఈ విషయమై తగిన విచారణ చేయించి కఠిన చర్యలు తీసుకోవాలని డివిజన్ వాసులు కోరుతున్నారు.



విచారణ జరపాలి

ఐఎస్‌సదన్ డివిజన్ వాసుల సమస్యల పరిష్కారానికి నిత్యం వారితో మమేకమై పనిచేస్తున్నా. సింగరేణి కాలనీ వాంబే గృహ సముదాయాల వద్ద రహదారి నిర్మాణ విషయమై జరిగిన అవినీతిపై నిష్పక్షపాత విచారణ జరిపితే నిజాల నిగ్గు తేలుతుంది. తప్పు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటే మరోమారు అలాంటి తప్పు జరగదు.

–జంగం శ్వేతామధుకర్‌రెడ్డి, కార్పొరేటర్

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి

వనస్థలిపురం: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అన్నారు. గ్రేటర్ కమిషనర్ ఆదేశాల మేరకు ఎంటమాలజీ సిబ్బంది నిర్వహిస్తున్న ఫాగింగ్ పైలట్ ప్రాజెక్ట్‌ను డివిజన్ పరిధిలోని కమలానగర్‌లో అధికారులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాకాలం దృష్ట్యా మలేరియా, మెదడువాపు, చికన్‌గున్యా తదితర వ్యాధులు వ్యాప్తిచెందే అవకాశం ఉందని, ప్రతి ఒక్కరు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంటమాలజీ అధికారులు ఏఈ రవిందర్, ఈఎఫ్‌ఏ ప్రసాద్, నాయకులు గోవిందాచారి, కమలానగర్ కాలనీ అధ్యక్షుడు టీ.వీ.రావు, సుబ్బారావు, భరత్‌సింగ్, మల్లికార్జున్, వెంకటేశ్వర్‌రావు, దివాకర్ లింగం, మదన్‌రెడ్డి, సారంగం, జగదీశ్వర్, నిర్మల, మహాలక్ష్మి, ఇందిర పాల్గొన్నారు.

ఆహ్వానం అందజేత

మన్సూరాబాద్: అంబేద్కర్ అభయహస్తం డిక్లరేషన్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని దళిత గిరిజన ఆదివాసీ జేఏసీ డిమాండ్ చేసింది. జూన్ 26న నగరంలోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించే రౌండ్‌టేబుల్ సమావేశానికి హాజరు కావాలని మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు కు శుక్రవారం ఆహ్వాన పత్రికనుజేఏసీ నాయకులు అందజేశారు. అంబేద్కర్ అభయ హస్తం సాధన కోసం చేవెళ్ల డిక్లరేషన్ పై దళిత గిరిజన ఆదివాసీ జేఏసి జూన్ 26న సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించనున్న రౌండ్‌టేబుల్ సమావేశానికి మేధావులందరూ హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో కండెల వెంకటేశ్వర్లు, ముత్యపాగ నర్సింగ్‌రావు, బొంకూరి సురేందర్, సన్ని పాల్గొన్నారు.



నర్సింహులుకు ఆహ్వానపత్రికను అందజేస్తున్న నాయకులు

పైపులైన్ లేని ప్రాంతంలో డ్రైనేజీ పనులు

ఎల్‌బీనగర్: బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని భూగర్భడ్రైనేజీ పనులను చేంజ్ ఆఫ్ సైట్ భాగంగా పైపులైన్ లేని చోట గతంలో మంజూరైన పనులను ఇతర ప్రాంతాలకు మార్చామని జలమండలి మేనేజర్ సిరివెన్నెల తెలిపారు. ఎస్‌కేడీనగర్ మొయిన్ రోడ్డు వద్ద వేసే పైపులైన్ ఇతర కాలనీలకు మార్చినట్లు వస్తున్న ఆరోపణలు నిజం లేదన్నారు. హైయర్ డయా పైప్‌లైన్ వేసేందుకు పైపులు లేకపోవడంతో పనులు నిలిపేశామని తెలిపారు. బీఎన్‌రెడ్డినగర్ శివాలయం పక్కన ఉన్న డ్రైనేజీ పైపులైన్ లెవల్స్ సరిగా లేకపోవడంతో తరుచూ డ్రైనేజీ పొంగుతుందన్నారు. పైపులైన్ కూడా ఇంటి నిర్మాణం కింద ఉండడంతో డ్రైనేజీని శుభ్రం చేయడం కష్టంగా ఉందని దీనిని దృష్టిలో పెట్టుకుని అక్కడ ఉన్న పైపులైన్‌ను మార్చి రీమోడలింగ్ చేస్తున్నామన్నారు.

సిగ్నల్స్ లేక.. ముందుకు సాగక

హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్ పోస్టాఫీసు చౌరస్తా ట్రాఫిక్‌కు నిలయంగా మారింది. ప్రధాన కూడలి కావడంతో ఈ మార్గం గుండా నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. రోడ్డు ఇరుకుగా ఉండటం, ఆపై రహదారికి ఇరువైపులా ఆటోల పార్కింగ్‌తో పాటు.. ట్రాఫిక్ సిగ్నల్ వ్యవస్థ లేక, ట్రాఫిక్ పోలీసుల పర్యవేక్షణ కొరవడి వాహన చోదకులు, ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. పద్మవ్యూహం నుంచి బయటపడేందుకు చెమటోడుస్తున్నారు. అయినప్పటికీ.. పలువురు వాహనదారులు ఇష్టానుసారంగా దూసుకెళ్తూ ఇతర వాహనదారులను, ప్రజలను భాయందోళనకు గురిచేస్తున్నారు.

అడ్డదిడ్డంగా పరుగులు..

అసలే ఇరుకు దారి. ఆపై నియంత్రణ లేకపోవడంతో వాహనాలు అడ్డదిడ్డంగా పరుగులు తీస్తున్నాయి. పలువురు వాహనదారులు మితిమీరిన వేగంతో దూసుకుపోతున్నారని, దీని వలన ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు.ఎల్‌బీనగర్, కొత్తపేట, దిల్‌సుఖ్‌నగర్, కర్మన్‌ఘాట్ వెళ్లాలంటే ఈ కూడలే ప్రధాన మార్గం. సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని, చౌరస్తాతో పాటు ప్రధాన మార్గంలోనూ ట్రాఫిక్ సిగ్నల్స్‌తో పాటు, పోలీసులను ఏర్పాటు చేయాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

చికిత్స పొందుతున్న విద్యార్థి మృతి

నాగోలు: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న విద్యార్థి మృతి చెందిన ఘటన ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్‌లో పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం..ఎల్‌బీనగర్ మన్సూరాబాద్, సౌంత్ ఎండ్ పార్క్‌కు చెందిన అజ్మీరా రాజశేఖర్(21) ఎల్‌బీనగర్ డీవీఎం కాలేజీలో డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్నాడు. ఈనెల 21న రాత్రి 10:30 రాజశేఖర్ తన ద్విచక్ర వాహనంపై ఎల్‌బీనగర్ కామినేని చౌరస్తా నుంచి సిరీస్ రోడ్డు వైపు వెళుతుండగా ఎక్సలెన్స్ కాలేజీ పక్కన ఉన్న దుర్గా బాణసంచా దుకాణం దగ్గరకు రాగానే మరో వ్యక్తి ద్విచక్ర వాహనంపై వేగంగా వచ్చి రాజశేఖర్‌ను వాహనాన్ని ఢీ కొట్టాడు.ఈ ప్రమాదంలో రాజశేఖర్ తలకు బలమైన గాయం కావడంతో కామినేని హాస్పిటల్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. రాజశేఖర్‌ను ఢీకొట్టిన వ్యక్తి మన్సూరాబాద్ సెంట్రల్ బ్యాంక్ కాలనీకి చెందిన గోపీకృష్ణ కుందారపు నగరంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. ఈ ప్రమాదంలో గోపి కృష్ణకు తలకు తీవ్ర గాయమై కామినేని హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడు. ఈ ప్రమాదంలో ఇద్దరూ హెల్మెట్ ధరించలేదని దీంతో పెద్ద ప్రమాదం జరిగిందని పోలీసులు తెలిపారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సైదాబాద్: చెట్ల కొమ్మల తొలగింపు, మరమ్మతు పనుల కారణంగా ఆస్మాన్‌గఢ్ ట్రాన్స్‌కో డివిజన్ పరిధిలో విద్యుత్ అంతరాయం ఉంటుందని డీఈ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు.

ఉదయం 9 గంటల నుంచి 11 వరకు..

ఆస్మాన్‌గఢ్, సంజయ్‌గాంధీ నగర్, మాధవ్ నగర్, బిలాల మజీద్, సపోటాబాగ్, ఎల్‌ఐసీ కాలనీ, బాకర్‌బాగ్, లక్ష్మీనగర్ క్రాస్‌రోడ్, వాణినగర్, పటేలమ్మ మడిగ, ఆనంద్ బిస్కెట్ ఫ్యాక్టరీ, దోభీఘాట్ రోడ్, సిరిపురం కాలనీ, ఫ్రెండ్స్ కాలనీ, ఆరోరా కాలేజ్ ఆపోజిట్, రామాలయం టెంపుల్, గురుదాస్‌చ సలీంనగర్, రామారావ్ కంపెనీ, సలీంనగర్ మిల్క్‌బూత్ డౌన్, పద్మావతి అపార్ట్‌మెంట్స్, సలీంనగర గణేష్ టెంపుల్, ఎంఎంహెచ్ హాస్పిటల్, తిరుమల లైన్, ఉస్మాన్‌పురా హనుమాన్ టెంపుల్, మర్తుజా మజాద్, చుంతిసా మజీద్, డీసీపటేల్ కాలనీ, ముస్తానా హాస్పిటల్, హుస్సేనీ మొహెల్లాచ ఎస్‌డీఎం స్కూల్, గోల్‌కబర్, ఎంబీ హట్, క్రీడా, సంతోష్ నగర్ వాటర్‌వర్క్స్, ఐఎస్‌సదన్ రోడ్, దోభీఘాట్, భానునగర్, హైదరాబాద్ హౌజ్, సైదాబాద్ మెయిన్‌రోడ్ పరిసర ప్రాంతాలు.

మధ్యాహ్నం 3నుంచి సాయంత్రం 5వరకు..

కరణ్‌బాగ్, జీఏ పార్క్, జీఏ కాలనీ, నియోరాయల్ స్కూల్, శ్రీనివాస కమ్యూనిటీహాల్, రామాలయం, పద్మావతి కల్యాణ మండపం, లక్ష్మీనగర్, ఇంద్రప్రస్థ కాలనీ, టెలిఫోన్ ఎక్స్ఛేంజ్, సంగం లక్ష్మీబాయి కాలేజ్, సిరిపురం కాలనీ, మనోజః మాన్షన్ అపార్ట్‌మెంట్స్, సిరిపురం కాలనీ కమ్యూనిటీహాల్,మలక్‌పేట గంజ్, ప్రేమలత కాలనీ, గంజ్ బీఎస్‌ఎన్‌ఎల్ ఆఫీస్, చర్మాస్ లేన్ ఆపోజిట్, మూసానగర్, కమల్‌నగర్, గవర్నమెంట్ సిటీ మోడల్ స్కూల్, నయాగరా హోటల్, బోధ్‌లేషా కిడికి, చెన్నయ్ కా కేఫ్, కోమటివాడి, పెంటయ్య బ్యాండ్, కాలీ మజీద్, కమలేషా దర్గా, జబ్బార్ హోటల్, యాయా పాషా మజీద్, అన్న డైరీ ఫాం, ముంతాజా కాలనీ, భానునగర్, ఫజిల్ మజీద్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు.

మలక్‌పేట ఏసీపీగా సుబ్బారామిరెడ్డి



మలక్‌పేట: మలక్‌పేట ఏసీపీగా కే.సుబ్బారామిరెడ్డి శుక్రవారం డబీర్‌పురలోని కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఏసీపీగా పని చేసిన జి. శ్యామ్‌సుందర్ బదిలీ కాగా.. డీజీపీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాల్సిందిగా డీజీపీ ఆదేశాలు జారీ చేశారు. తెలంగాణ యాంటీ నార్కోటిక్ బ్యూరోలో డీఎస్పీగా విధులు నిర్వహించిన సుబ్బారామిరెడ్డి బదిలీపై మలక్‌పేటకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల సహకారంతో శాంతి భద్రతల పరిరక్షణ కోసం కృషి చేస్తామన్నారు.

రైతు బజార్‌లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతు బజార్‌లలో కూరగాయల ధరల వివరాలు.. టమాటా రూ.13,వంకాయ రూ.23,బెండ రూ.35,పచ్చిమిర్చి రూ.35, కాకరకాయ రూ.35, బీరకాయ రూ.40, కాలిఫ్లవర్ రూ.18, క్యాబేజీ రూ.13, క్యారెట్ రూ.25, దొండ రూ.23, ఆలుగడ్డ రూ.24,ఉల్లిగడ్డ రూ.19, గోకరకాయ రూ.35, దోసకాయ రూ.15, సొరకాయ రూ.09, పొట్లకాయ రూ.23, అరటికాయ రూ.09, చిక్కుడుకాయ రూ.55, చామగడ్డ రూ.35, మునగ రూ.50, కందగడ్డ రూ.50, బీట్‌రూట్ రూ.19, కీర రూ.28, బీన్స్ రూ.85, క్యాప్సికమ్ రూ.45.

ఇళ్ల విషయంలో ఆందోళన చెందొద్దు



కాలనీలవాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

వనస్థలిపురం: తమ ఇళ్ల విషయమై కమలానగర్, ఆంధ్రకేసరినగర్, పరిసర కాలనీల ప్రజలు ఎలాంటి ఆందోళనలకు గురి కావద్దని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని కమలానగర్, ఆంధ్రకేసరినగర్, పరిసర కాలనీలవాసులు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని కలిశారు. గత 40 ఏళ్లుగా ఆయా కాలనీల్లో తాము ఇళ్లు కట్టుకుని నివాసముంటున్నామని ఇటీవల ఓ వ్యక్తి కాలనీలకు చెందిన స్థలాలు నావే అంటూ ఆర్‌డీఓ కార్యాలయంలో కేసు వేయగా దానిపై ఆర్‌డీఓ స్టేటస్‌కో ఇచ్చారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఈ విషయమై తాము ఆర్‌డీఓను ప్రశ్నిస్తే మరోసారి పరిశీలిస్తామని చెప్పారని అన్నారు. ఈ విషయమై తమకు న్యాయం చేయాలని ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. దీంతో ఎమ్మెల్యే ఆర్‌డీఓకు ఫోన్ చేసి కాలనీల ప్రజలు ప్రభుత్వ అనుమతులు, బ్యాంకుల ద్వారా రుణాలు తీసుకుని ఇళ్లు కట్టుకున్నారని, ఎలాంటి కబ్జాలకు పాల్పడలేదని తెలిపారు. ఎవరో మిమ్మల్ని తప్పుదోవ పట్టిస్తున్నారని ఆర్‌డీఓకు వివరించారు. కాలనీలలో పర్యటించి తగిన న్యాయం జరిగేలా చూస్తానని ఎమ్మెల్యే కాలనీవాసులకు హామీ ఇచ్చారు.



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం

ఎల్‌బీనగర్: బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని ప్రతి కాలనీలో మౌలిక వసతులు కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నామని, బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. గాయత్రీనగర్ బ్యాంకు కాలనీ సబ్ స్టేషన్ నుంచి గాయత్రీనగర్ ఫేజ్–2 వరకు నిర్మించే సీసీ రోడ్డు పనులను శుక్రవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలన్నారు. కాలనీల్లో జరుగుతున్న పనుల్లో స్థానికులు భాగస్వాములైతే సకాలంలో పూర్తవుతాయన్నారు. సమస్యలు లేని కాలనీలుగా తీర్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ రాజ్‌కుమార్, కాలనీవాసులు భవానీ, రాంబాబు,ఉపేందర్, డాక్టర్ విజయ్,మధుసూదన్‌రెడ్డి,శేఖర్,సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యుత్ అధికారులు, సిబ్బంది ఫోన్ నెంబర్లు మార్పు

చంపాపేట: విద్యుత్ అధికారులు, సిబ్బందికి కొత్త నెంబర్లను కేటాయించారు. కాలనీలు, బస్తీల్లో విద్యుత్ సమస్యలు, సరఫరాలో హెచ్చు తగ్గులు, అంతరాయం ఉంటే వెంటనే ఈ నంబర్లను సంప్రదించాలని అధికారులు సూచించారు.

సబ్ స్టేషన్‌లు ఎఫ్‌ఓసీ నంబర్లు

బడంగ్‌పేట:	8712472425
చంపాపేట:	8712472415
మీర్‌పేట:	8712472423
లెనిన్‌నగర్:	8712472422
వనస్థలీపురం:	8712472420
బైరామల్‌గూడ:	8712472427
బీఎన్‌రెడ్డి:	8712472413

చంపాపేట

చంపాపేట డీఈ కె. రాజేందర్ ఫోన్ నెం:	8712472406
ఏడీఈ కె. వెంకటనర్సింహ్మారెడ్డి ఫోన్ నెం:	8712472407
ఏడీఈ ఐసీఎస్‌సీ కె. సునీత:	8712472409
ఏఈ శ్రీనివాస్ ఫోన్ నెం:	8712472414
ఏఈ ప్రవళికారెడ్డి	8712472429

వనస్థలీపురం

ఏడీఈ ఎం. రాంచదర్:	8712472408
ఏఈ కె. వెంకటరావు:	8712472419
మీర్‌పేట ఏఈ బాలగౌడ్:	8712472416
బైరామల్‌గూడ ఏఈ వి. పర్వతాలు:	8712472418
లెనిన్‌నగర్ ఏఈ రవికుమార్:	8712472421
బిఎన్‌రెడ్డి ఏఈ శివకుమార్:	8712472411
బడంగ్‌పేట ఏఈ వి.శ్రీనివాస్:	8712472426

మలక్‌పేటలో ప్రైవేట్ హాస్టళ్ల తనిఖీ



హాస్టల్ తనిఖీ చేస్తున్న డీసీ జయంత్

మలక్‌పేట: ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జీహెచ్‌ఎంసీ సర్కిల్–6 మలక్‌పేట డిప్యూటీ కమిషనర్ జయంత్ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రైవేట్ హస్టళ్లల్లో తనిఖీలు చేశారు. మూసారంబాగ్ డివిజన్ పరిధిలోని దిల్‌సుఖ్‌నగర్, గడ్డిఅన్నారం ప్రాంతాల్లోని ప్రైవేట్ హస్టళ్ల వివరాలు సేకరించారు. ఫుడ్‌లైసెన్స్, ట్రేడ్ లైసెన్స్, ప్రాపర్టీ ట్యాక్స్, శానిటేషన్ నిర్వహణపై ఆరా తీశారు. ట్రేడ్, ఫుడ్‌లైసెన్స్ లేని, భవన నిర్మాణ అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న 13 మందికి రూ. 25 వేలు జరిమానా విధించినట్లు తెలిపారు.

కాలనీలలో కార్పొరేటర్ పర్యటన



కాలనీవాసులతో మాట్లాడుతున్న ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి

చైతన్యపురి: గడ్డిఅన్నారం కార్పొరేటర్ బద్దం ప్రేమ్ మహేశ్వర్‌రెడ్డి శుక్రవారం జీహెచ్‌ఎంసీ శానిటేషన్ సిబ్బందితో కలిసి ఉదయ్‌నగర్‌కాలనీ, కమలానగర్, న్యూగడ్డిఅన్నారం కాలనీలలో పర్యటించారు. మార్నింగ్ వాక్‌లో భాగంగా కాలనీల్లో తిరుగుతూ స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకన్నారు. ఇటీవల కురిసిన వర్షానికి రహదారులపై మట్టి పేరుకుపోయి రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని వర్షం నీటితో కొట్టుకొచ్చిన చెత్త, చెట్ల కొమ్మలు రహదారుల వెంట ఉన్నాయని కార్పొరేటర్‌కు స్థానికులు తెలిపారు. శానిటేషన్ డీఈ చందనతో ఫోన్‌లో మాట్లాడగా సిబ్బందిని పంపించి మట్టి కుప్పలు, చెత్తను తొలగింపజేశారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ సూపర్‌వైజర్ బుచ్చయ్య, ఎస్‌ఎఫ్‌ఏ సంజీవరెడ్డి, సాయి స్థానిక కాలనీవాసులు పాల్గొన్నారు.

నియామకం

చంపాపేట: చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్ ధ్యానాంజనేయ స్వామి ఆలయ నూతన పాలక మండలి సభ్యులను నియమిస్తూ శుక్రవారం ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసింది. సభ్యులుగా దిండు ప్రవీణ్‌గౌడ్, తోకటి కిరణ్ కుమార్, సింగంశెట్టి శ్రీనివాస్, జనుంపల్లి విష్ణువర్ధన్ రెడ్డి, నారాయణ దుర్గారెడ్డి, కుకునూరి గోపాల్‌రెడ్డి, పూల నాగరాజు, కె. కవిత, ఓరుగంటి నరేష్, కొండ్ర సంతోష్ కుమార్, బండిగారి శ్రీనివాస్‌గౌడ్, అనుముల రవీందర్‌రెడ్డి, ఈదులకంటి సత్యనారాయణ రెడ్డి నియమితులయ్యారు. ఆలయ ప్రధాన అర్చకులు ఎస్ అంబాప్రసాద్ ఎక్స్ అఫిషీయో సభ్యులుగా కొనసాగుతారు. పాలక మండలి సభ్యుల పదవీ కాలం ఏడాది ఉంటుంది. పాలక మండలి సభ్యులు తమలో ఒకరిని చైర్మన్‌గా ఎన్నుకోవాల్సి ఉంటుంది. ఈదులకంటి సత్యనారాయణ రెడ్డికి చైర్మన్ పదవి దక్కనున్నట్లు తెలుస్తుంది. కాగా ప్రస్తుతం ప్రకటించిన నూతన పాలక మండలి జాబితాలో మెరిశెట్టి శ్రీనివాస్ పేరు గూడా ఉన్నప్పటికీ ఇటీవలే ఆయన అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో ఆయన స్థానంలో త్వరలోనే మరొకరిని నియమించే అవకాశం ఉంది.

ఉద్యోగాల పేరుతో రూ. 2.60 లక్షలు వసూలు

వ్యక్తి రిమాండ్



పోలవరపు సురేష్

నాగోలు: సాఫ్ట్‌వేర్, ఐటీ కంపెనీల్లో ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ సోషల్ మీడియాలో ప్రకటనలు ఇచ్చి నిరుద్యోగుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్న వ్యక్తిని రిమాండ్‌కు తరలించారు. ఏసీపీ శివశంకర్‌గౌడ్ వివరాల ప్రకారం..కొత్తపేట గడ్డిఅన్నారంకు చెందిన మహేశ్వరి, బీటెక్ పూర్తిచేసి సాఫ్ట్‌వేర్ ఉద్యోగం కోసం వెతుకుతుంది. ఈ క్రమంలో నెల్లూరుకు చెందిన పోలవరపు సురేష్ (32) ఆమె వివరాలు తెలుసుకొని తాను టెక్ మహేంద్ర కంపెనీలో మేనేజర్ అంటూ పరిచయం చేసుకొన్నాడు. తమ కంపెనీలో జావా ప్రోగ్రాం డెవలపర్ జాబ్ ఇప్పిస్తాని ఆమెతో పాటు ఆమె స్నేహితుల నుంచి రూ. 2.60 లక్షలు తీసుకుని ఆ తర్వాత వారి ఫోన్ ఎత్తడం లేదు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న రాచకొండ సైబర్ క్రైమ్ పోలీసులు పోలవరపు సురేష్‌ను శుక్రవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సురేష్‌పై వివిధ పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదైఉన్నట్లు పోలీసులు తెలిపారు.